మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



## బట్టీ పట్టించడం కాదు

# అర్థమయ్యేలా బోధించాలి..

**హన్వాడలో పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ విజయేంద్రిబోయి**



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్రిబోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 24 ప్రభాతవార్త :** హన్వాడ మండలం సలోనిపల్లిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో ఒకటి నుంచి ఐదవ తరగతి విద్యార్థులతో బోధనాంశాలపై జిల్లా కలెక్టర్ పాఠాలు చదివించారు. విద్యార్థినీ, విద్యార్థులు సరిగా పాఠాలు చదవలేకపోడం గమనించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని, కేవలం బట్టీపట్టడం కాకుండా అర్థం చేసుకునేలా ఉపాధ్యాయులు బోధించాలని అన్నారు. తొలుత హన్వాడ మండలంలో సర్వే నంబర్ 718లో ప్రభుత్వ భూమిని కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, తహసిల్దార్ కిష్టానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరం దాడి ఘటనపై

# ఎస్పీ శ్రీనివాసరావు వివరణ



**గద్వాల, జులై 24 ప్రభాతవార్త:** ఈనెల 13వ తేది నాడు ఉండవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట స్థావరం పై దాడికి సంబంధించి పలు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు, వివరణ ను ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. పేకాట స్థావరం పై దాడి సందర్భంగా వచ్చిన ఆరోపణ దృష్ట్యా, మీడియా మిత్రులు కూడా వివరణ కోరుతున్న సందర్భంగా ఇట్టి ఆరోపణ పై జిల్లా అదనపు ఎస్పీ కె.గుణశేఖర్ ఆధ్వర్యంలో పూర్తి విచారణకు ఆదేశించడం జరిగిందని, ఈ సంఘటనలో పోలీసు అధికారులపై గాని, సిబ్బంది పై గాని ఆరోపణ రుజువైతే అట్టి వారిపై తప్పకుండా శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. అలాగే ఆరోపణలకు సంబంధించిన బాధితులు ఎవరైనా ఉంటే ముందుకు వచ్చి నేరుగా లేదా, ఫోన్‌లో తమని సంప్రదించి ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి నిజమని తెలితే బాద్యులపై తప్పకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అట్టి బాధితుల వివరాలు కూడా గోప్యంగా ఉంచబడుతాయని జిల్లా ఎస్పీ ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.



## సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో

# ప్రాజెక్టులను పూర్తి చేస్తాం...

- రైతులకు 2 పంటలకు సాగునీరు అందిస్తాం...
- గుడిపల్లి రిజర్వాయర్ నుంచి కల్వకుర్తి ఎస్ఐఎస్ ఆయాకట్టుకు సాగునీరు విడుదల
- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి వర్యులు జూపల్లి కృష్ణారావు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 24 ప్రభాతవార్త:** సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేస్తామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి వర్యులు జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు 2 పంటలకు సాగునీరు అందించడమే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యంగా పనిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. బుధవారం గుడిపల్లిగట్టు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఆయాకట్టుకు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి వర్యులు జూపల్లి కృష్ణారావు మోటార్లకు ప్రత్యేక పూజలు చేసి నీటిని విడుదల చేశారు. కల్వకుర్తి ప్రాజెక్ట్ పరిధిలోని 3.65లక్షల ఎకరాల ఆయకట్టులో మూడింట రెండువంతులకు పైగా గుడిపల్లి గట్టు రిజర్వాయర్ నుంచి నీరు అందుతుందని, రిజర్వాయర్ నుంచి నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట ప్రధాన కాల్వలకు జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యేలు కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, మెఘారెడ్డిలతో కలిసి మంత్రి నీటిని విడుదల చేశారు. ఒక పంపు ద్వారా ప్రతి రోజు 650 క్యూసెక్యులనీటిని విడుదల చేయనున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ జిల్లాలోని కల్వకుర్తి, అచ్చంపేట, నాగర్‌కర్నల్ నియోజకవర్గాల రైతులకు వాన దేవుడి దయతో 2 పంటలకు సాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవలే ఉమ్మడి ప్రాజెక్టుల సమీక్ష సమావేశంలో పనుల పురోగతిపై వేగవంతం చేసేలా చర్యలు తీసుకున్నట్లు



మోటార్లకు ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి



గుడిపల్లి రిజార్వయర్ పంపుహౌస్ వద్ద పరిశీలిస్తున్న మంత్రి

మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ వహించిందని, అందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. జిల్లాలోని వివిధ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ఎమ్మెల్యేలంతా రాష్ట్ర స్థాయిలో పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. అనంతరం కృష్ణమ్మకు పూలతో స్వాగతం పలికారు. అంతకు మందు ఇంజనీరింగ్ అధికారులతో మంత్రి సమావేశమై నీటి లభ్యత, విద్యుత్ వినియోగం తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు ఎస్సీ సత్యనారాయణరెడ్డి, ఈఈ రవీందర్, ఎస్వీఎస్ కంపెనీ ఎండీ.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

**వెల్దండ, జూలై 24 ప్రభాతవార్త:**వెల్దండ మండలం కొట్ర చౌరస్తాలో ఏర్పాటు చేస్తున్న దివంగత మాజీ కేంద్రమంత్రి సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహన్ని ఈనెల28న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. సీఎం భద్రత ఏర్పాట్లను కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు పరిశీలించారు. కల్వకుర్తిలోని మున్సిపల్ కార్యాలయం ప్రక్కనున్న ఖాళీ స్థలం గ్రౌండ్‌లో నిర్వహించనున్న సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ, హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి సమస్యలు తెలత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించాలని పకడ్బంది ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కే.సీతారామారావు, డీఎస్పీ పార్థసారథి, మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ కురుమూర్తి, మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, కాయితీ సాయిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, నాయకులు పర్వత్‌రెడ్డి, సంజీవ్‌కుమార్‌యాదవ్, మట్ట వెంకటయ్యగౌడ్, జక్కుల చిన్న జంగయ్యయాదవ్, ఆయా శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

# స్పోర్ట్స్ అభివృద్ధిలో జిల్లాకే మొదటి ప్రాధాన్యత..

- రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కొత్త కాపు శివ సేన రెడ్డి...!
- జిల్లాలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు కృషి చేస్తా...!
- దేశానికి క్రీడాకారులను అందించే రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం...!
- పెద్దగూడెం నుంచి వనపర్తి వరకు కాంగ్రెస్ కార్యకర్తల భారీ ర్యాలీ...!
- ర్యాలీలో పాల్గొన్న, ఎమ్మెల్యే మేఘారెడ్డి, మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్...!

**వనపర్తి ప్రతినిధి జులై 24 ప్రభాతవార్త :** స్పోర్ట్స్ అభివృద్ధిలో రాష్ట్రంలోనే జిల్లాకు మొదటి ప్రాధాన్యత ఇస్తానని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కొత్త కాపు శివసేనారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆధ్వర్యంలో స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డికి బుధవారం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు మరిక్రుంట నుంచి లక్ష్మీ కృష్ణ గార్డెన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సన్మాన సభ కార్యక్రమంలో శివసేనారెడ్డి మాట్లాడుతూ... గతంలో స్పోర్ట్స్ అభివృద్ధికి ఏ ప్రభుత్వం కేటాయించని నిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



భారీ ర్యాలీతో బయలుదేరిన రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్



సన్మాన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

ఆధ్వర్యంలో కేటాయించడం జరిగిందన్నారు. జిల్లాకు స్పోర్ట్స్ స్కూల్ మంజూరు చేయించడమే తన కర్తవ్యం అని తెలిపారు. రాష్ట్రంలోనే ఏకైక హాకీ అకాడమీ కలిగిన వనపర్తిలో రానున్న మూడు నెలల్లో టర్ఫ్ కోర్ట్ ఏర్పాటు చేయడం కోసం కృషి చేస్తా అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గం తర్వాత వనపర్తి నియోజకవర్గానికే అధిక ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. స్పోర్ట్స్ అభివృద్ధిలో భాగంగా ప్రతి జిల్లాకు 50 ఎకరాల భూమిని కేటాయించడం జరుగుతుందని, దేశానికి క్రీడాకారులను అందించే నెంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణను నిలుపుతామన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు తాను వెన్నుదన్నుగా ఉంటానని భరోసా ఇచ్చారు.

**బిజెపి ఎంపీలు ధర్నాకు కలిసి రావాలి...**

**ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి**

కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిన మోడీ ప్రభుత్వం పై పోరాటం చేయడానికి రాష్ట్రంలో బిజెపి పార్టీ నుంచి గెలిచిన 8 మంది ఎమ్మెల్యేలే కాంగ్రెస్ ఎంపీలతో కలిసి రావాలని, ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర ధర్నా చేయాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

–మిగతా4లో..

## ప్రతి పల్లెకు బస్సు పోవాలి...

# ప్రతి విద్యార్థి బడికి రావాలి

**అసెంబ్లీలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి**



**మక్తల్ టౌన్,జులై 24 ప్రభాతవార్త :**పాఠశాలల సమయంలో ఆర్టీసిబస్సులను నడ పాలని మక్తల్ నియో జకవర్గ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కోరా రు. అసెంబ్లీలో బుధ వారం ఆయన మా ట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమయ్యే సమయానికి మన ప్రభుత్వంలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు అందించామని తెలి పారు. అయితే వారు పాఠశాలకు వెళ్లేందుకు సరైన సమయాని కి బస్సులు వస్తున్న కొంత బస్సుల కొరత ఉందని సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్తే వారు కూడా దానికి సానుకూలంగా స్పందించి, కొన్ని కొత్త బస్సులను కూడా మంజూరు చేసి, కొత్త రూట్‌లలో నడపించారని తెలిపారు. అందుకు గాను సంబంధి త మంత్రివర్యులకు, అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వారికి సభా ముఖంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఇంకా అక్క డక్కడ కొంత బస్సుల కొరత కూడా ఉంది. దానిని కూడా త్వరలో పూర్తి చేయాలని కోరారు. ఈ విధంగా చేసినట్లయితే విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువుకోవడానికి వీలవుతుందన్నారు. అదే విధంగా ప్రైవేట్ పాఠశాలల బస్సుల ను కూడా ఫిట్‌నెస్‌గా ఉన్న బస్సులనే రోడ్డుపై నడిపించే విధం గా చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వం హయాంలో కొన్ని నాణ్యత లేని బస్సులు నడపడం వల్ల కొన్ని ప్రమాదాలు కూడా జరిగాయని గుర్తు చేశారు.

# జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని విస్తరించాలి..

**ప్రతిరోజు 50 వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స నిర్వహించాలి**

**జంతు జనన నియంత్రణ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ విజయేంద్రిబోయి**



జంతు జనన నియంత్రణ కేంద్రాలను సందర్శిస్తున్న కలెక్టర్ విజయేంద్రిబోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 24 ప్రభాతవార్త :** పట్టణంలోని జంత జనన నియంత్రణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి బుధవారం సందర్శించారు. పుర పాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనన నియంత్రణ కేంద్రంలో వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ గురించి మున్సిపల్ కమిషనర్, పశు సంవర్ధక శాఖ అధికారులతో అడిగి తెలుసుకు న్నారు. ప్రతిరోజూ 10 వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రోజు 50 వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స నిర్వహించాలని, జంతు జనన నియంత్రణ కేంద్రంలో జడ్చర్ల, భూతప్పూర్ మున్సి పాలిటీ సంబంధించి కూడా జనన నియంత్రణ కేంద్రంలో జడ్చర్ల, భూతప్పూర్ మున్సిపాలిటీకి సంబంధించి కూడా జనన నియంత్రణ నిర్వహించాలని, జంతు జనన నియంత్రణ కేంద్రం మరింత విస్తరించాలని సూచన చేశారు. అనంతరం రామయ్యబౌలిలో వరదనీరు ద్వారా గతంలో ముంపుకు గురయ్యే ప్రాంతాన్ని సందర్శించారు. మర్లు దగ్గర వరదనీరు కాల్వ నుండి శివశక్తినగర్ పక్కన కాల్వకు వరదనీరు డైవర్ట్ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్రయిన్ అంచున ఉన్న సక్సెస్ స్కూల్ ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్నందున స్కూల్ యాజమాన్యంను అప్రమత్తం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, పశు సంవర్ధక శాఖ జెడి మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ ఏడి వెంకటేశ్వర్లు ఉన్నారు.

# ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి

**గద్వాల, జులై 24 ప్రభాతవార్త:** అధిక ఆదాయాన్నిచ్చే ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించి రైతులను ప్రోత్సాహించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఎర్రవల్లి మండలం బీచుపల్లిలోని టి.జి.అయిల్ ఫెడ్, ఆయిల్ ఫామ్ నర్సరీ, ఆయిల్ ఫాంను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నర్సరీలోని ఆయిల్ ఫాం మొక్కలను పరిశీలిస్తూ మొక్కల సేకరణ, వాటిని నాటడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటి పారుదలతో పాటు సాగుకు సంబంధించిన వివరాలను సంబంధితులయే అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జిల్లాకు టార్గెట్ 2 లక్షల మొక్కలు అవసరమని, సంవత్సరం నుండి రెండున్నర సంవత్సరాల మొక్కలు అందుబాటులో ఉన్నాయని, ఇంత వరకు 36000 మొక్కలు రైతులకు పంపిణీ చేశామని ఇంకను 63000 మొక్కలు నర్సరీలో అందుబాటులో ఉన్నట్లు నిర్వాహకులు కలెక్టర్ కు వివరించారు. అలాగే నర్సరీలోని కల్లింగ్ మొక్కల వివరాలు సాగులో తీసుకుంటున్న జాగ్రత్తలు, మెళకువలు, ఎరువుల యాజమాన్యం, మొక్కల సంరక్షణ, కలుపు నివారణ నీటి వసతి, ఇతర అంశాల గురించి వారు కలెక్టర్ కు తెలియజేశారు. ఆయిల్‌పామ్ తో పాటు వివిధ రకాలకు చెందిన అంతర పంటలను కూడా సాగు చేసి దీని ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన తరువాత నాలుగో సంవత్సరం నుంచి దిగుబడులు ప్రారంభం అవుతాయని, 30 సంవత్సరాల వరకు ఈ మొక్క దిగుబడి ఇస్తూ రైతులకు ఆదాయాన్ని ఇస్తుందన్నారు. ప్రభుత్వం కూడా ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సాహిస్తూ పెద్ద ఎత్తున రాయితీలను ఇస్తుందన్నారు. రైతులు ఆయిల్ ఫాం సాగు చేసుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో ప్రచారం చేసి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. స్వల్ప పెట్టుబడితో అధిక ఆదాయాన్ని ఆయిల్ ఫాం సాగు విషయంలో ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యేక చర్యల గురించి గ్రామాల్లో ప్రతి రైతుకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కొండపేట గ్రామంలో ఒక రైతు యొక్క



ఆయిల్ పామ్ తోటలను పరిశీలన చేసిన కలెక్టర్ సంతోష్ , ఉద్యానవన శాఖ అధికారి అక్క అక్బర్ అలీభాషా

ఆయిల్ ఫాం తోటను సందర్శించారు. ఆయిల్ ఫాం తోట సాగు పద్దతులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించి, ఆ రైతుతో సాగు మరియు డ్రిప్ ఇరిగేషన్ పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తిమ్మాపూర్‌లోని జిల్లా ఉద్యాన వన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో మెగా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా మరో ఆయిల్ పాం తోటను సందర్శించి అక్కడ ఓట మొక్కను నాటారు. ఆయాల్ ఫాం సాగుతో రైతుల ఆర్థిక స్థితిలో పురోగతి వస్తుందని తెలిపారు. మునగాల గ్రామ శివారులోని మూడు సంవత్సరాల ఆయాల్ ఫాం తోటను, షాబాద్ గ్రామంలో ఉన్న నాలుగు సంవత్సరాల ఆయాల్ ఫాం తోటను కలెక్టర్ పరిశీలించారు. తోటలోని గెలల సేకరణ, హర్వెస్టింగ్ విధానాలను పరిశీలించి రైతులకు ఆయిల్ ఫాం సాగుపై మరింత అవగాహన కల్పించడం పై దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన వన శాఖ అధికారి అక్బర్ అలీ, నర్సరీ, ఇంచార్జి చంద్రశేఖర్, అన్ని మండలాల ఉద్యాన వన శాఖ అధికారులు, టిజి ఫెడ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి:జిల్లా కలెక్టర్



పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తపట్నాయక్

**ఉట్నూర్,జులై 24 ప్రభాతవార్త :** విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా కలెక్టర్ సిక్తపట్నాయక్ అన్నారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు గురించి తెలుసుకున్నారు. ఒక్కో తరగతికి ముగ్గురు విద్యార్థుల చొప్పున అనుపస్థితి (ఆబ్‌సెంట్) కావడంపై కలెక్టర్ ఉపాధ్యాయులను ప్రశ్నించారు. విద్యార్థులు పాఠశాలకు సక్రమంగా రాకపోతే వారి తల్లిదండ్రులకు ఫోన్లుచేసి పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల ఆవరణలో ఫర్నీచర్ వృధాగా ఎందుకు వేశారని, ఏవైనా ప్రభుత్వ కార్యాలయాలకు ఫర్నీచర్‌ను పంపించాలన్నారు. అయితే ఉన్నత పాఠశాల ఆవరణలోనే ఉర్దూ మీడియం కొనసాగుతుండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పలువురు గ్రామస్తులతో పాటు ఉపాధ్యాయులు కలెక్టర్‌కు విన్నవించగా, జిల్లా విద్యాశాఖ అధికారి, తహసిల్దార్, ఎంపిడిఓలు ఒక కమిటీగా ఏర్పడి గ్రామ పెద్దల సలహాలు సూచనలతో పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల ఇతర సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటే బాగుంటుందని గ్రామపెద్దల అభిప్రాయం సేకరించాలన్నారు. పాఠశాల సమస్యలు, పరిష్కార మార్గాలను చూపుతూ ఒక నివేదిక తయారు చేసి తనకు ఇవ్వాలని ఆమె ఆదేశించారు. ఉర్దూ మీడియంలోని ఆరవ తరగతి గదికి వెళ్లి ఓ విద్యార్థిని చేత ఉర్దూ చాప్టర్ 3 పాఠాన్ని చదివించారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాలలోని పదవ తరగతి గదిలోకి వెళ్లి గణిత డిజిటల్ బోధనను ఆమె పరిశీలించారు. అందరికి స్కూల్ యూనిఫామ్‌లు వచ్చాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గతేడాది పదో తరగతి పరీక్షా ఫలితాలు 97 శాతం వచ్చాయని, ఈ విద్యా సంవత్సరం 100% ఫలితాలు సాధించాలని ఆమె విద్యార్థులకు సూచించారు. పదవ తరగతి విద్యార్థులు యాక్షన్ ప్లాన్ తయారు చేసి 100% ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అలాగే అమ్మ ఆదర్శ పాఠశాలల పనులపై కలెక్టర్ ఆరా తీశారు. మన ఊరు మనబడి కింద చేపట్టిన అసంపూర్తి పనులకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని, ఆయా పనులపై ప్రభుత్వం త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం ఆమె వ్యక్తం చేశారు. ప్రస్తుతం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి ద్వారా కొనసాగుతున్న నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని పిఆర్‌ఏఈ ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఓ అబ్దుల్ ఘని, తహసిల్దార్ మమత, సూపరింటెండెంట్ కొండన్న, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, పాఠశాలల హెడ్మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల రుణాలు మాఫీ చేయాలని ముఖ్యమంత్రిని కలిసిన అల్లంపూరు ఎమ్మెల్యే విజయుడు

**కర్నూలులోని కెనరా బ్యాంకులో రైతులు తీసుకున్న రుణాలను ఆపు చేయాలని సీఎంకు వినతి**



**ఇటిక్యాల జులై 24 ప్రభాతవార్త:** అల్లంపూరు నియోజకవర్గంలోని మానవపాడు మండలంలోని వివిధ గ్రామాల రైతులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు పట్టణంలోని కెనరా బ్యాంకులో ఎన్నో ఏళ్లగా రైతులు పట్టాదారు పాస్ పుస్తకాలపై క్రాప్ లోన్లు తీసుకున్నారని అలాంటి రైతులకు ప్రభుత్వం రుణమాఫీ వర్తింపచేసేలా చూడాలని బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు కలిసి వినతిపత్రం సమర్పించారు. గత ప్రభుత్వాలు అలంపూర్ నియోజకవర్గంలోని రైతులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు ఇతర ప్రాంతాలలోని బ్యాంకులలో తీసుకున్న రుణాలను మాఫీ చేశాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఇచ్చిన వినతిపత్రంలో వివరించారు. సానుకూలంగా స్పందించిన సీఎం అధికారుల ద్వారా నివేదికలను తెప్పించుకుని అలాంటి రైతులకు రుణమాఫీ అయ్యే విధంగా చూస్తానని సీఎం హామీ ఇచ్చినట్లు అలంపూరు ఎమ్మెల్యే విజయుడు తెలిపారు.

## రేషన్ డీలర్లు పేదల బియ్యం కొనుగోలు చేస్తే డీలర్ షిప్ రద్దు చేస్తాం..

**తహశీల్దార్ షేక్ చాంద్ బాషా**



**అమరచింత జులై 24 ప్రభాతవార్త :** ప్రభుత్వం పేదలకు సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని రేషన్ షాప్ డీలర్లే లబ్ధిదారులతో కొనుగోలు చేసి బియ్యం వ్యాపారులకు అమ్ముతున్నారని తమ దృష్టికి వచ్చిందని అలాంటి చర్యలకు డీలర్లు పాల్పడితే డీలర్ షిప్ రద్దు చేస్తామని మండల తహశీల్దార్ షేక్ చాంద్ బాషా డీలర్లను హెచ్చరించారు. బుధవారం అమరచింత మండల తహశీల్దార్ కార్యాలయంలో డీలర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ, కొందరు బియ్యం వ్యాపార్తులు డీలర్ల షాపు దగ్గరనే ఆటోలు, బైకుల మీద బియ్యం తరలిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని డీలర్లు రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేయాలని లేనిచో కఠిన చర్యలు తప్పవని ఆయన అన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని ప్రతి లబ్ధిదారుడు తప్పక రేషన్ బియ్యాన్ని తీసుకెళ్లాలని ఆయన లబ్ధిదారులను కోరారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా రేషన్ షాపుల ముందు పోలీస్ పహారా ఏర్పాటు చేస్తామని తహశీల్దార్ షేక్ చాంద్ బాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ, గోపాల్, మండల సీనియర్ అసిస్టెంట్ వెంకటయ్య పాల్గొన్నారు.

## అమిస్తాపూర్‌లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సర్వే..!!

**- సర్వేలో పాల్గొన్న డీఎంఓ భాస్కర్ నాయక్..**



**భూత్పూర్,జులై 24,ప్రభాతవార్త :** భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్‌లో భూత్పూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం జర్వ సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో జిల్లా మలేరియా అధికారి(డీ ఎంఓ) డాక్టర్ భాస్కర్ నా యక్ పాల్గొని వర్షాకాలంలో సంభవించే డెంగ్యూ, మలే రియా, చికెన్‌గున్యా వంటి రోగాల బారి నుంచి సురక్షి తంగా ఉండాలని ఇంటింటి సర్వేలో డీఎంఓ ప్రజలకు సూ చించారు. దోమలు ఇంటి పరిసరాల్లో నిల్వ నీటిలో ఎక్కువగా స్థావరం ఏర్పరచుకుని మలేరియా జ్వరానికి దారి తీస్తాయని తెలిపారు. ప్రజలు సాధ్యమైనంత వరకు నీటని నిల్వ ఉండకుండా చూడాలని, నీటిలో మలేరియా లార్వా పెరుగుదలను అరికట్టాలని కోరారు. తమ ఆరోగ్య అధికారులు, సిబ్బంధి ప్రతి శుక్రవారం డ్రైడేను నిర్వహిస్తున్నారని, డ్రైడేలో ప్రతి ఒక్కరూ పాల్గొని పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భూత్పూర్ పీహెచ్‌సీ ఎంఓ డాక్టర్ మొహ్మద్ అబ్దుల్ రబ్, సీహెచ్ఓ అయూబ్‌ఖాన్, హెచ్ఏ ప్రమోద్‌కుమార్, ఏఎన్ఎం కృపావతి ఇతర ఆరోగ్య సిబ్బంధి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



**ఆత్మకూర్ జులై 24 ప్రభాతవార్త :** టిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు కల్వకుంట్ల తారక రామారావు జన్మది నోత్సవాన్ని మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్ట ణంలోని టిఆర్ఎస్ నాయ కులు ఘనంగా జరుపుకు న్నారు. పట్టణంలోని గాంధీ చౌరస్తాలో కేటీఆర్ జన్మది నోత్సవాన్ని పురస్కరించు కొని కేక్ కట్ చేసి ప్రజల కు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిప ల్ చైర్మన్ గాయత్రి రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసే కార్యక్రమంలో భాగంగా టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా వెల్లి ప్రభు త్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎంపీపీ బంగారు శ్రీనివాసులు మాట్లాడుతూ ఆత్మకూరు మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీకి తమ సంపూర్ణ సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కేటీఆర్ ఆదేశాల మేరకు పార్టీ కోసం సాయి శక్తుల ప్రయత్నిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు రవికుమార్ యాదవ్, శ్రీధర్‌గౌడ్, వీరేశలింగం, మున్సిపల్ కౌన్సిలర్లు రామకృష్ణ, తబుస్సు చెన్నయ్య, గడ్డమీద శ్రీనివాసులు ,తదితరులతో పాటుగా పలువురు నాయకులు, కార్యర్తలు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం తెలంగాణకి సున్నా బడ్జెట్



**వనపర్తి టౌన్ జులై 24 ప్రభాతవార్త :** పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రంలో ఎనిమిదిలో ఎనిమిది తీసేస్తేసున్నా అన్నట్లుగా కాంగ్రెస్, బీజేపీలు వ్యవహరిస్తున్నాయని ఎంఐఎం ఖయ్యుమ్ ఎద్దేవ చేశారు. నిప్పు నిప్పు రాసుకుంటే బూడిద రాలుతుంది అనే సామెతను తెలంగాణ రాష్ట్రం పై ప్రయోగించడం దారుణమన్నారు. తెలంగాణ రాష్ట్రాని కి ఏకపక్ష ధోరణితో బడ్జెట్ ని కేటాయించడం కేంద్ర ప్రభుత్వానికి తగదని చెప్పారు. రాబోయే రోజుల్లో బిజెపి ప్రభుత్వానికి తెలంగాణ ప్రజలు బుద్ధి చెప్తారన్నారు, తెలంగాణ ప్రజలు కూడా బిజెపి ప్రభుత్వానికి ఓట్లు వేశారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలు కూడా జీఎస్టీ, ఆదాయ పన్ను కడుతున్నారు. ప్రజల నోట్లో మట్టి కొట్టడం సరైన పద్ధతి కాదు, కాంగ్రెస్ ప్రభుత్వం పై ఉన్న బేధ అభిప్రాయం ఉంటే బడ్జెట్ కేటాయించకపోవడం, జీర్ణించుకోలేని విషయం అని విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

## ఎమ్మెల్యేను కలిసిన మార్కెట్ చైర్మన్, డైరెక్టర్లు



**కొత్తకోట జులై 24 ప్రభాతవార్త :** మదనపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు కలిసి దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. మాకు ఈ సదావకాశం కల్పించిన మీకు ఋణపడి ఉంటామని మా బాధ్యతలు రైతులకు ఉపయోగకరంగా ఉండేట్టు పని చేస్తామని చైర్మన్, డైరెక్టర్ లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ లు బాలయ్య, శేఖర్ రెడ్డి, వెంకటేష్‌నాయక్, విజయ్, కొత్తకోట మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మిషేక్, రామ్మోహన్ రెడ్డి, సంద వెంకటేష్, సుభాష్, రాజు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భూత్పూర్‌లో ఘనంగా మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు..!!

**-చెక్‌డ్యాం వద్ద కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టిన మాజీ ఎమ్మెల్యే ఆల..**

**భూత్పూర్, జులై 24, ప్రభాతవార్త :** మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు(కేటీఆర్) 49వ జన్మదిన వేడుకల్ని భూత్పూర్‌లో బుధవారం దవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పరస్పరం స్వీట్లు పంచిపెట్టుకుని సంబరాలు నిరహిం చారు. ఈ క్రమంలోనే ఇటీవల కురుస్తున్న వర్షాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన చెక్‌డ్యాంలు నిండి అలుగు పారుతున్న నేపథ్యంలో కొత్తమొల్గర గ్రామానికి సమీపంలోని చౌలతండా వద్ద అలుగు పారుతున్న బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన చెక్‌డ్యాం వద్ద మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ పార్టీ భూత్పూర్ మండల అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్ కదిరే అశోక్‌రెడ్డి, మాజీ వైఎస్ ఎంపిపి నరేష్‌గౌడ్ రైతులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి, కేక్ కట్ చేసి పరస్పరం స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆల మాట్లాడుతూ తమ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. రైతులకు ప్రయోజనం చేకూర్చే మిషన్ కాకతీయ పథకం పేరిట తాము చేపట్టిన చెర్వులు, కుంటలు, చెక్‌డ్యాంల నిర్మాణాలు కళ్లముందు కన్పిస్తున్నాయన్నారు. కళ్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజా సంక్షేమం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధే ఉంటే



చెక్‌డ్యాం వద్ద కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్



కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలకు స్వీట్లు తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల

పాస్‌బుక్ కల్గిన ప్రతి రైతుకు ఆంక్షలు లేని రుణమాఫీతో పాటు రైతు బంధును వెంటనే విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మనెమోని సత్యనారాయణ, సత్తూర్ నారాయణగౌడ్, సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్, మొల్గర నర్సింహులుగౌడ్, తూము శ్రీనివాస్‌రెడ్డి, టి మురళిధర్‌గౌడ్, మేకల సత్యనారాయణ, సత్తూర్ సురేష్‌గౌడ్, మొహ్మద్ సాధిక్, సత్తూర్ అశోక్‌గౌడ్, గడ్డం రాములు, గడ్డం ప్రేమ్, గడ్డం డీలర్ నర్సింహ్మా, ఆగిరి సత్యం, మాల విఠల్‌దాస్ వెంకటేష్, సత్తూర్ తిరుపతయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్పోరేట్లకు లాభాలు.. పేదలపై భారాలు..

**కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై సిపిఎం నాయకులు ఆగ్రహం**




గద్వాలలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

**గద్వాల , జులై 24 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పోరేట్ శక్తులకు లాభాలు తెచ్చి పెట్టి విధంగా పేద ప్రజలపై భారాల మోపే విధంగా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి విమర్శించారు. తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసి బడ్జెట్ నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని వైయస్సార్ చౌరస్తా ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పోరేటర్లపై వారి ఆదాయానికి తగ్గ పన్నులు ఎందుకు విధించడం లేదని ప్రశ్నించారు. గత బడ్జెట్లో 30 శాతంగా ఉన్న పన్నులను ఈ బడ్జెట్‌లో 22 శాతానికి ఎందుకు తగ్గించారని ప్రశ్నించారు. సంపన్నుల మీద విధించే వారసత్వ పన్నును కనీసం ప్రతిపాదించడానికి కూడా నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ రాబడులను 14.5 శాతం చూపించిన ప్రభుత్వం ప్రజల నుండి సేకరించిన రాబడిని వారి కోసం ఖర్చు చేయకుండా రెవెన్యూ ఖర్చులు కేవలం 5.91 శాతానికి ఎందుకు తగ్గించిందని నిలదీశారు. వ్యవసాయం ఆహారం, ఎరువులు, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి భారీగా నిధుల కోతలు పెట్టి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నభిన్నం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వ చిన్నాభిన్నం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటు గురించి ప్రస్తావన తీసుకురాలేదని , పరిశ్రమల స్థాపన జరగకుండా ఉపాధి సృష్టి జరగకుండా, సంపద ఏవిధంగా పెరుగుతుందని ప్రశ్నించారు. నైపుణ్య శిక్షణ అభివృద్ధి చేయడం కోసం రెండు లక్షల కోట్లు కేటాయించామని ప్రగల్భాలు పలుకుతున్న కేంద్ర ప్రభుత్వం ఉపాధి సృష్టి లేకుండా వృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో 30 లక్షల ఉద్యోగాలు ఖాళీలు ఉంటే వాటిని భర్తీ చేయకుండా కేవలం శిక్షణ ఇస్తామంటే ఉద్యోగ అవకాశాలు ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. తెలంగాణ నుండి ఎనిమిది మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్న బడ్జెట్లో కనీసం తెలంగాణ పేరు ప్రస్తావించకపోవడం కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ పట్ల పక్షపాత ధోరణి తెలియజేస్తుందని అన్నారు. విభజన హామీలు నెరవేర్చకుండా పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, రైల్వే ప్రాజెక్టులు , విద్యాసంస్థలకు, నిధులు కేటాయించకుండా ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని భాగస్వామ్య పక్షాలను సంతృప్తి పరచడం కోసం బడ్జెట్ ని కేటాయించడం దారుణం అన్నారు. జిడిపిలో అధిక నిధులు సమకూర్చే దక్షిణ భారతదేశానికి పూర్తి అన్యాయం చేసిందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సహకార సమాఖ్య స్ఫూర్తి గురించి గొప్పలు చెప్పే పెద్దలు నిధుల కేటాయింపులో ఈ వివక్ష ఏమిటని ప్రశ్నించారు. కార్పోరేట్లకు లాభాలు, పేద ప్రజలపై భారాలు, మోపే బడ్జెట్ ను ఈ తిరోగమన బడ్జెట్‌ని ప్రజల వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేర్ నరసింహా నాయకులు శివ, పరుశురాం, అశోక్, అంజి, మల్లయ్య, నరేశ్, రాఘవేంద్ర, గోవిందు రాము తదితరులు ఉన్నారు.

# ఘనంగా కెటిఆర్ జన్మదిన వేడుకలు

**కేక్ కట్‌చేసి పండ్లు పంచిపెట్టి సంబరాలు చేసుకున్న బిఆర్ఎస్ శ్రేణులు**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 24 ప్రభాతవార్త :** భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పుట్టిన రోజు వేడుకలను మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు అందరు కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, డిసిసిబి వైస్ చైర్మన్ వెంకటయ్య, ముడా మాజీ చైర్మన్ వెంకన్న, పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు శివరాజ్, వినోద్, కౌన్సిలర్లు గణేష్, అనంతరెడ్డి, రాము, ప్రవీణ్, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, నవకాంత్, రామకృష్ణ, అహ్మదుద్దిన్, సుధాకర్ పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కెటిఆర్ ఎంతో చురుగ్గా పాల్గొన్నారని అన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను బంగారు తెలంగాణగా మార్చేందుకు ఎంతో కృషి చేశారని చెప్పారు. భగవంతుడు ఆయనకు సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు. అనంతరం అంధుల పాఠశాలలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు.




మహబూబ్‌నగర్‌లో కేక్ కట్ చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు



జడ్చర్లలో కేక్ కట్ చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**జడ్చర్లలో...**

కెటిఆర్ జన్మదిన వేడుకలను జడ్చర్ల మండల కేంద్రంలోని సిగ్నల్‌గడ్డ వద్ద అంబేద్కర్ విగ్రహం దగ్గర కేక్ కట్‌చేసి పటాకులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కొడుగల్ యాదయ్య, పార్టీ మండలాధ్యక్షులు రఘుపతిరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ పిట్టల మురళి, మాజీ ముడా డైరెక్టర్ ఇమ్ము, ప్రణీల్ చందర్, కౌన్సిలర్లు సతీష్, కోట్ల ప్రశాంత్‌రెడ్డి, నాయకులు పాలాది రాంమోహన్, బాదేపల్లి రంజిత్‌బాబు, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



**కొత్తకోట జులై 24 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు జన్మదిన వేడుకలు కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ముందుగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చౌరస్తాలో బాణ సంచాలు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ప్రభుత్వ హాస్పిటల్ లో రోగులకు పండ్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, మాజీ జడ్పీటీసీ విశ్వేశ్వర్, జిల్లా అధికార ప్రతినిధి గాడిల ప్రశాంత్, కౌన్సిలర్లు రవీందర్ రెడ్డి, అయ్యన్న, రాములు యాదవ్ తిరుపతయ్య ,ఖాజామైనోద్దిన్. తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కెటిఆర్ జన్మదిన వేడుకలు



పూజలు నిర్వహిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**మక్తల్, జులై 24 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె. తారకరామారావు జన్మదిన వేడుకలను బుధవారం మక్తల్‌లో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ పి. నరసింహాగౌడ్ ఆధ్వర్యంలో జన్మదిన కేకును కట్ చేసి వేడుకలు జరుపుకు న్నారు. అంతకు ముందు స్థానిక పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రంలో మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చిన్న హనుమంతు, అన్వర్ హుస్సేన్, జుట్ల శంకర్, చందాపురం అశోక్‌కుమార్‌గౌడ్, శివారెడ్డి, జుట్ల సాగర్, మెహబూబ్, మహ్మద్ భాష, శేఖర్‌రెడ్డి, నరసింహయాదవ్, ఈశ్వర్ యాదవ్, మనస్‌పాషా, సత్యనారాయణగౌడ్, తిరుమలేష్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, నరసింహ, హనుమంతు, బాలరాజు, బాలప్ప తదితరులు పాల్గొన్నారు.

# స్నేహ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం



**వీపనగండ్ల జులై 24 ప్రభాతవార్త :** వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన 2003 సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ కి చెందిన బాల్య మిత్రుడు బుధవారం నాడు బాల్య కొట్టం రవి ఇటీవల చనిపోవడం జరిగింది. అయితే చనిపోయినటువంటి కుటుంబానికి బాల్య స్నేహితులు అండగా ఉంటామని హామీ మేరకు కొట్టం రవి కుటుంబానికి ఎస్ఎస్‌సి-2003 బ్యాచ్ చెందినటువంటి స్నేహితులందరూ కలిసి తమ స్నేహితుని కుటుంబానికి 23,400 రూపాయలు ఆర్థిక సహాయం ఆయన భార్యకు చేయడం జరిగింది. ఈ సందర్భంగా తోటి స్నేహితులు మాట్లాడుతూ స్నేహితులందరూ స్పందిస్తూ కొట్టం రవి మరణించడం చాలా బాధకరము, వారి కుటుంబానికి మనోధైర్యం ఇవ్వడం కోసం ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందని వారు తెలిపారు. ప్రతి ఒక్కరు తమకు తొచినంత సహాయం చేశారు. స్నేహితులు మాట్లాడుతూ ఎస్ఎస్‌సి-2003 బ్యాచ్‌కి చెందినటువంటి ప్రతి యొక్క స్నేహితుని కుటుంబం ఆపదలో తమ వంతు సహాయం చేస్తూ ఆదుకోవడానికి మేము సిద్ధంగా ఉన్నామని చెప్పుతూ, అంతకు ముందు రవి ఆరోగ్య కారణాల వల్ల కుటుంబానికి ఇబ్బంది కలుగుతున్న విషయం తెలుసుకుని దాదాపు 38000 రూపాయల ఆర్థిక సాయం చేయడం జరిగింది. ఈ సందర్భంగా బాల స్నేహితులు సహకారంతో స్నేహం విలువను గుర్తిస్తూ స్నేహబంధం ఫౌండేషన్ ఏర్పాటు చేసుకుని ఈ ఆర్థిక సాయం అందజేసిన స్నేహితులు ఆడం తిరుపతయ్య ,నక్క వీరస్వామి ,విజయ్ ,బాలకృష్ణ, శ్రీకాంత్ ,వాళ్ల కుటుంబ సభ్యులకు అందజేశారు.

# గద్వాలలో ఘనంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు

**గద్వాల, జులై 24ప్రభాతవార్త:** నియోజకవర్గ వ్యాప్తంగా బాసు హనుమంతు నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేటీఆర్ జన్మదినం సందర్భంగా మల్దకల్‌లోని శ్రీ స్వయంభు లక్ష్మి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న బాసు హనుమంతు నాయుడు అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గద్వాల నియోజకవర్గంలోని మండల కేంద్రంలో ప్రభుత్వ హాస్పిటల్లో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసి, కేకులు కట్ చేశారు. పార్టీ సీనియర్ నాయకులు మాజీ జడ్పిటిసి శామల , సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు హన్మంతు నాయుడు, గద్వాల ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నందు రోగులకు పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జోగులాంబ గద్వాల జిల్లా నియోజకవర్గ వ్యాప్తంగా జిల్లా బిఆర్ఎస్ పార్టీ నాయకులు బాసు హనుమంతు నాయుడు ఆధ్వర్యంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. నియోజకవర్గ పరిధిలోని గట్టు, మల్దకల్ , ధరూర్ మండల కేంద్రంలో స్థానిక మండల నాయకులు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేసి, కేకు కట్ చేసి, సంబరాలను చేసుకున్నారు. అనంతరం గద్వాల్ పట్టణంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ రోగులకు మాజీ జడ్పిటిసి బాసు శ్యామల, బిఆర్ఎస్ పార్టీ నాయకులు బాసు హనుమంతు నాయుడు చేతుల మీదుగా పండ్లు ,బ్రెడ్లను పంపిణీ చేసి, కేక్ కట్ చేశారు .అనంతరం హాస్పిటల్ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియక్ నాయకులు అంగడి బస్వరాజు ,మాజీ ఎంపీటీసీ కిష్టప్ప ,బీరెల్లి బీచుపల్లి ,నాగరాజు ,తిరుమల్, ఆటో ముక్బూల్, బాసు గోపాల్, ఎల్లం దొడ్డి రాజు నాయుడు ,మోనేష్ ,గార్లపాడు పరుషరామ్ గంగన్న ,గోవిందు, మచర్ల లోకేష్ ,బాసు బోజ్జయ్య రాయాపురం వీరేష్, గట్టు టీఆర్ఎస్ వెంకటేష్, కంగారు తిమ్మప్ప ,తిప్పయ్య ,శ్రీకాంత్ నాయుడు ,ఆబ్బు, తిమ్మ రెడ్డి ,గోపి, రాజు గోపాల్, రాజు, దోర్నాల వీరేష, కర్రెప్ప, వివిధ గ్రామాల పార్టీ నాయకులు కార్యకర్తలు ,తదితరులు పాల్గొన్నారు .





కేక్ కట్ చేస్తున్న మాజీ జెడ్పిటీసి షామాల,ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న శామల హన్మంత్ నాయుడు

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు








**బిజినపల్లి, జులై 24 ప్రభాతవార్త:** తెలంగాణ కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా చాటిన ఘనత కెటిఆర్‌ది అని మాజీ ఎంపిపి పుప్పాల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం కెటిఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కెటిఆర్‌ఆలోచన విధానాలతో తెలంగాణ అభివృద్ధిలో ముందుకు దూసుకుపోయిందన్నారు. గాడ్‌ఆఫ్ తెలంగాణ కెసిఆర్, ఫ్యూచర్ ఆఫ్ తెలంగాణ కెటిఆర్‌అని అభివర్ణించారు. రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు నెల్లికంటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కెటిఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో ఐటిరంగం అభివృద్ధి చెందిందన్నారు. ప్రపంచంలోని ప్రముఖ ఐటి కంపెనీలు హైదరాబాద్ వైపు చూస్తున్నాయంటే అది కెటిఆర్ చొరవేనని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చడంలో కెటిఆర్ సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. కెసిఆర్ నాయకత్వంలో కెటిఆర్ మార్గదర్శకంలో బిఆర్‌ఎస్ పార్టీ రాబోయే రోజుల్లో విజయఢంక మోగించడం ఖాయమన్నారు. వేడుకల్లో మాజీ ఎంపిటిసి బాలస్వామి, తిరు పతిరెడ్డి, మాజీ సర్పంచ్‌అశోక్, మంగ్లీ, పిఎసిఎస్ వైస్‌ఛైర్మన్ నర్సింహారెడ్డి, నాయకులుసొప్పరి బాలస్వామి, కంపిండ్లపర్వతాలు, గంగనమోని కురుమ య్య, రవిందర్‌రెడ్డి, గోపినాయక్, జగదీష్, సట్ల కృష్ణయ్య, శివ, శ్రీను, ఖాజా పాల్గొన్నారు.

**అడ్డాకుల, జులై 24 ప్రభాతవార్త:** అడ్డాకుల మండల కేంద్రంలో బుధవారం బిఆర్‌ఎస్ పార్టీ మండల నాయకుల ఆధ్వర్యంలో మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు 48వ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా నిర్వహించారు. అనంతరం కెటిఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని మాజీ జడ్పీటిసి నల్లమద్ది రాజశేఖర్‌రెడ్డి సహకారంతో ప్రజలకు గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజల సంక్షేమం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రతినిత్యం ప్రజాక్షేత్రంలో ప్రజల కోసం నిరంతరం పరితపించే శ్రామికుడు రాష్ట్రంలో ఐటి పరిశ్రమ రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన నాయకుడు అని కొనియాడారు. భవిష్యత్తులో అత్యున్నత పదవులు అధిరోహించి ప్రజలకు సేవ చేయాలని బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు టి. శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ జితెందర్‌రెడ్డి, మాజీ కో ఆప్షన్ ఖాజాగోరి, మండల యూత్ అధ్యక్షులు బాలరాజు, మాజీ ఎంపిటిసిలు రంగన్నగౌడ్, చంద్రయ్య, మాజీ సర్పంచ్‌లు నాయకులు దేవేందర్‌రెడ్డి, మహేష్‌యాదవ్, కృష్ణయ్యయాదవ్, వెంకటేష్, జహంగీర్, శ్రీనివాసులు, ఆశన్న, డేవిడ్, బిఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

**వనపర్తి టౌన్, జులై 24 ప్రభాతవార్త:** వనపర్తి బిఆర్‌ఎస్ నాయకులు కల్వకుంట్ల తారక రామారావు 48వ జన్మదినాన్ని పట్టణ పార్టీ అధ్యక్షులు పలుస రమేష్ గౌడ్ ఆధ్వర్యములో ఘనంగా నిర్వహించారు. మొదట పట్టణ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్స్ పంచినారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షులు గట్టు యాదవ్ పట్టణ పార్టీ అధ్యక్షులు పి.రమేష్ గౌడ్ మాట్లాడుతూ మలిదశ ఉద్యమంలో రాష్ట్ర సాధన కోసం కే.టి.ఆర్ ప్రాణాలకు తెగించి ఉద్యమం చేశారని మా భవిష్యత్తు తరాల నాయకుడు ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు ఖండిస్తూ ప్రభుత్వం పై యుద్ధం చేస్తున్న కే.టి.ఆర్ నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, గ్రంథాలయ మాజీ ఛైర్మన్ బి.లక్ష్మయ్య, మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, ప్రధాన కార్యదర్శి పరంజ్యోతి, కౌన్సిలర్ బండారు కృష్ణ, నాయకులు ఉంగ్లమ్ తిరుమల్, నీల స్వామి, సూర్యవంశపు గిరి, స్టార్ రహీమ్, సునీల్ వాల్మీకి, దెవర్ల నరసింహ, యుగేందర్ రెడ్డి, నందిమల్ల రమేష్, మురళీ సాగర్, నందిమల్ల రవి, కవిత, జోహెబ్, శిరిగిరి మన్నెం, అరీఫ్, పాషా, గోర్లబాలయ్య, చంద్రయ్య, అఖిలెందర్, నందిమల్ల సుబ్బు, లోకాజీ, నక్క మహేష్, ఇంతియాజ్, అలీం, టి శ్రీను, సత్యం, రవి, వజ్రాల రమేష్, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**గోపాల్‌పేట, జులై 24 ప్రభాతవార్త:** గోపాలపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి వర్యులు, సిరిసిల్ల శాసనసభ్యులు కెటి రామారావు జన్మదినం సందర్భంగా బుధవారం రోజు భారత రాష్ట్ర సమితి పార్టీ మండల కమిటీ తరపున గర్భిణీ స్త్రీలకు, రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో బిఆర్‌ఎస్వి రాష్ట్ర నాయకులు శ్రావణ్ కుమార్, సోషల్ మీడియా మండల కన్వీనర్ శివ కుమార్, పులెందర్, ఓంకార్, యాదగిరి, మునేష్, లోకేష్, మన్సూర్, నరేందర్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

**ఇటిక్యాల జులై 24 ప్రభాతవార్త:** మాజీ మంత్రి బిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ జన్మదినం సందర్భంగా బుధవారం అసెంబ్లీ చాంబర్లో అల్లంపూర్ ఎమ్మెల్యే విజయుడు మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

**అమరచింత జులై 24 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు మాజీ జెడ్పిటిసి హెచ్ బి రాజేందర్ సింగ్ స్వగృహంలో టిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేసి టిఆర్‌ఎస్ నాయకులు స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ఈ సందర్భంగా టిఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, అక్కల నరసింహులు గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో భవిష్యత్తులో కేటీఆర్ ఆధ్వర్యంలో టిఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని పేదల సంక్షేమమే టిఆర్‌ఎస్ పార్టీ పనిచేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెట్ మాజీ చైర్మన్ ఎస్ ఏ రాజు, టిఆర్‌ఎస్ పార్టీ పట్టణ కార్యదర్శి, చిన్న బాలరాజ్, టిఆర్‌ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు, జింక రవి, మున్సిపల్ కౌన్సిలర్ బిఎస్ రాజకుమార్, కో ఆప్షన్ షాన్ వాజ్ ఖాన్, కోరి శ్రీనివాసులు, షంషీర్, డిజె శేఖర్, తోకలి నారాయణ, హోటల్ రాజేష్, శంకర్ నాయక్, తదితరులు ఉన్నారు.

**కల్వకుర్తిటౌన్, జులై 24 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలో బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను కల్వకుర్తి పట్టణంలోని వృద్ధాశ్రమంలోఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో వృద్ధులకు 10 రోజులకు సరిపడ 25 కిలోల బియ్యం, కిరాణ సామాగ్రిని అందించినట్లు మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం తెలిపారు. కల్వకుర్తి ప్రభుత్వా సుపత్రి ఆవరణలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దారమోని గణేష్, తాళ్ల సురేష్‌గౌడ్, గణేష్, కిశోర్ తదితరులు ఉన్నారు.

# ఇది ముమ్మాటికి తెలంగాణ వ్యతిరేక బడ్జెట్

- సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్



**పాన్‌గల్ జులై 24 ప్రభాతవార్త:** ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్, ముమ్మాటికి తెలంగాణ వ్యతిరేక బడ్జెట్ గా ఉందని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్లమెంటులో ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన 2024,2025 యూనియన్ బడ్జెట్ దేశ ఆర్థిక వ్యవస్థను బలహీనపరిచేదిగా ఉందని కార్మిక వర్గానికి పేదలకు హాని చేసేదిగా ఉన్నదని పదేళ్ల నుంచి బిజెపి ప్రభుత్వం అనుసరించిన కార్పొరేట్ సంస్థల అనుకూల విధానాలకు కొనసాగించే కేంద్ర బడ్జెట్ అని పేర్కొన్నారు. ఉద్యోగులు కార్మికులు మధ్యతరగతి ప్రజలు ఈ బడ్జెట్‌ను వ్యతిరేకిస్తున్నారని తెలంగాణ ప్రస్తావనే లేదన్నారు, అదేవిధంగా రాష్ట్ర విభజనలో తెలంగాణకు ఇచ్చిన విభజన హామీలను కూడా ఏ మాత్రం పట్టించుకోలేదు అన్నారు, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వడంలో ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం నుండి ఎనిమిది మంది ఎంపీలు ఉన్న బిజెపి ఈ రాష్ట్రానికి బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం జరుగుతున్న చూస్తున్నారు. తప్పు ఏమి చేయలేని స్థితిలో ఉన్నారన్నారు. ఈ బడ్జెట్ పూర్తిగా తెలంగాణ రాష్ట్రానికి వ్యతిరేకమైందని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు బడా పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉన్న ఈ బడ్జెట్‌ను మార్చాలని తెలంగాణకు కేటాయింపులు జరగాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైల్వేలు జాతీయ రహదారులు కేంద్ర విద్యాలయాలతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. అంతకుముందు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బాల్య నాయక్, మండల నాయకులు, భగత్ జి వెంకటయ్య, భీమయ్య, ఎం వెంకటయ్య, జంబులయ్య, రాముడు, సాయిలీల, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులా..

**చిన్నచింతకుంట, జులై 24 ప్రభాతవార్త:** విద్యారంగ సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా అంటూ పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారాం ప్రశ్నించారు. బుధవారం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పిడిఎస్‌యు ప్రకటించడంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పిడిఎస్‌యు నాయకులను ముందస్తు అరెస్టు చేయడంలో భాగంగా పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారామ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలాగే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా విద్యారంగం పట్ల సరైన ప్రణాళికతో ముందుకెళ్లడం లేదని, ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని కూడా నియమించలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని అన్నారు. పూర్తిస్థాయిలో పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను అందించలేదని, విద్యార్థుల హక్కులు, విద్యాభివృద్ధిపై ఈ సమావేశాల్లో చర్చించి విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 8వేల కోట్లకుపైగా స్కాలర్‌షిప్, ఫీజు రియాంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని అడిగినందుకు ప్రభుత్వం పోలీసులతో అక్రమంగా అరెస్టు చేస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వానికి విద్యరంగం పట్ల చిత్తశుద్ధి ఉన్న వెంటనే విద్యారంగ డిమాండ్ల ను అమలు చేయాలని అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని సిపిఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథ) మండల కార్యదర్శి దేవదానం డిమాండ్ చేశారు.



పిడిఎస్‌యు నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

# ఆగస్టు 2న జోగులాంబ ఆలయానికి మంత్రి కొండా సురేఖ రాక

- మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆధ్వర్యంలో మంత్రిని కలిసిన ఆలయ ఈఓ, అర్చకులు



**ఇటిక్యాల జులై24 ప్రభాతవార్త:** ఆషాడమాసం చివరి శుక్రవారం ఆగస్టు 2వ తేదిన జోగులాంబ అమ్మవారి ఆలయంలో జరిగే శాకంబరీ ఆరుద్రోత్స వ కార్యక్రమాలకు హాజరు కావాలని కోరుతూ బుధవారం ఏఐసీసీ కార్యదర్శి అల్లంపూరు మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నివాసంలో ఆలయ ఈవో పురేందర్ కుమార్, ఆలయ అర్చకులు ఆనంద్ శర్మ మంత్రిని కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రతి ఏటా జోగులాంబ ఆలయంలో ఆషాడమాసం చివరి శుక్రవారం వివిధ రకాల కూరగాయలతో అమ్మావారిని అలంకరణ చేయడం ఆనవాయితీగా ఉందని అలాగే ఆరుద్రోత్సవంలో భాగంగా స్వామి వారిని అన్నాభిషేకం చేస్తారని మంత్రికి వివరించారు. అంతేకాక జోగులాంబ ఆలయ అభివృద్ధికి పుట్టవలసిన పనులపై నివేదికను అల్లంపూరు మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అందించారు. రాష్ట్రంలోని యాదాద్రి, వేములవాడ, కొండగట్టు, భద్రాద్రి తరహాలో ఏకైక శక్తిపీఠమైన అల్లంపూర్ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాల అభివృద్ధికి దేవదాయ శాఖ పూర్తిస్థాయిలో సహకారం అందించాలని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జోగులాంబ శక్తిపీఠం ఏకైక శక్తిపీఠం అన్నారు. ఇలాంటి శక్తిపీఠం ను గత ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో జోగులాంబ ఆలయానికి ఆలయ అభివృద్ధికి తగు ప్రణాళికలు రూపొందించాలని దీని కోసం నిపుణులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు.

## బిసిలను విస్మరించిన కేంద్రం

- బిసి సేన రాష్ట్ర అధ్యక్షులు బి.కృష్ణయాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న బూరుగుపల్లి కృష్ణ

**జడ్చర్ల, జులై 24 ప్రభాతవార్త:** కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బిసిలకు అన్యాయం జరిగిందని, బడ్జెట్ కేటాయింపుల్లో బిసిలను విస్మరించిందని బిసి సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణయాదవ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 48లక్షల 21వేల కోట్ల బడ్జెట్‌లో బిసిలకు కేవలం రూ. 2,200 కోట్ల కేటాయించిందని, దేశంలో ఉన్న 70 కోట్ల మంది బిసిలకు ఒకపూట భోజనానికి కూడా సరిపోదని ఒక ప్రణాళిక ప్రకారమే బిజెపి పార్టీ బిసిలను విస్మరిస్తుందని మండిపడ్డారు. ఓట్ల కోసం ఆరాటపడడం తప్ప బిసిల సంక్షమం కోసం పాటుపడని బిజెపి పార్టీకి రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పాలని, బిసి శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎంపి రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షాలతో కలిసి పార్లమెంటులో బిసి బిల్లు పెట్టి, చట్టసభలలో బిసిలకు 60శాతం రిజర్వేషన్లు, బిసి కులగణన, కేంద్రంలో బిసి మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలోని వెనుకబడిన జిల్లాలతో పాటు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి, బడ్జెట్ కేటాయించేలా కేంద్ర ప్రభుత్వం పై రాష్ట్ర మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి ఎంపిలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలనిడిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో బిసిలకు 50వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని, బిసి డిక్లరేషన్ అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇచ్చిన హామీ మేరకు బిసి సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి అదనంగా 20వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లానాయకులు మాచారం శ్రీనివాస్, కట్టమురళి, వెంకటేష్, రాములు, ఆంజనేయులు, రమణ, నరెందర్, నాగరాజు పాల్గొన్నారు.

## మహిళల హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

**పాన్‌గల్ జులై 24 ప్రభాతవార్త:** కేంద్రంలో భాజపా, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు మహిళల సమస్యలను పరిష్కరించకపోగా వారి హక్కులను కాలరాస్తున్నాయని ఐద్వా మహిళా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సాయిలీల అన్నారు. బుధవారం మండల పరిధిలోని తెల్లరాళ్లపల్లి తండా గ్రామాల్లో నిర్వహించిన మహిళా సంఘాల సమావేశంలో అరె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం ప్రత్యేకంగా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి వారి సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళల కోసం ఇచ్చిన 6గ్యారెంటీలలో ఆర్టీసీ బస్సు ఉచితం తప్ప మిగిలిన గ్యారెంటీలను అమలుపరచలేదన్నారు. మహిళల సమస్యల పై ఆగష్టు నెలలో వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించే జిల్లా మహాసభలకు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు. జిల్లా మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐక్య మహిళా సంఘం జిల్లా నాయకురాలు చిట్టెమ్మ, అనిత, లక్ష్మి భారతి, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



## వార్డులో చైర్మన్, కౌన్సిలర్ సుడిగాలి పర్యటన



గద్వాల మున్సిపాలిటీలోని 9వ వార్డులో పర్యటిస్తున్న చైర్మన్ కేశవ్

**గద్వాల, జులై 24 ప్రభాతవార్త:** ఇటీవలే కురిసిన వర్షాల కారణంగా 9వ వార్డు రాఘవేంద్ర కాలనీలో డ్రైనేజీలలో వర్షం నీరు నిలిచిపోవడంతో కౌన్సిలర్ శ్రీమాన్ నారాయణ, ప్రజల ఆహ్వానం మున్సిపల్ చైర్మన్ కేశవ్ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గద్వాల పట్టణం 9వ వార్డు రాఘవేంద్ర కాలనీ రాయిచూరు రోడ్డు సమీపంలో గల ఇటీవలే కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రధాన డ్రైనేజీలలో ఎక్కడ పడితే అక్కడ వర్షం నీరు నిలిచిపోవడంతో కాలనీ వాసుల ఆహ్వానం మేరకు మున్సిపల్ చైర్మన్ బి.యస్.కేశవ్, వార్డు కౌన్సిలర్ శ్రీమన్నారాయణ, వెళ్లి కాలనీ వాసుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ కేశవ్ జేసీబీ ద్వారా డ్రైనేజీల చుట్టూ ప్రక్కల పేరుకుపోయిన పిచ్చి మొక్కలు చెత్తచెదారాలను శుభ్రం చేయించారు. అదే విధంగా షాప్ యాజమాన్యం షాపుల ముం దర ఉన్న సీసీ బెడ్డులను తగ్గు ఎత్తులు వేయడంతో మురికి కాలువ పూడికతీత పనులకు అవకాశం లేనట్లు చేశారు. అందువలన చిన్న పాటి వర్షాలకు డ్రైనేజీల్ నిండిపోయి రోడ్లపైకి వర్షం నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అతి త్వరలోనే ప్రభుత్వ నిధులు వచ్చిన వెంటనే డ్రైనేజీల సమస్యలను తలెత్తకుండా చేస్తామని చైర్మన్ కేశవ్ కాలనీ వాసులకు హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ నాయకులుమోక్షం, నాగరాజు, రామకృష్ణ, ఆఫీజ్, సాబ్ కమ్మరి రాము, వడ్డేకృష్ణ, జగదీశ్, గోనెగండ్ల, వార్డు ప్రజలు, మున్సిపల్ అధికారులు, జవాన్లు పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్‌టియు టిఎస్ సంఘ సభ్యత్వ నమోదు

క్రియాశీలక సభ్యత్వ నమోదుకు అపూర్వస్పందన



**అయిజ జులై 24 ప్రభాతవార్త:** మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు ఐజ, కేజీబీవీ అయిజ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉత్తనూరు, ప్రాథమిక పాఠశాల ఉత్తనూరు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మేడికొండ ప్రాథమిక పాఠశాల మేడికొండ ప్రాథమిక పాఠశాల ఎస్సీ మేడికొండ పాఠశాలలో ప్రోగ్రెసివ్ రికగ్నైస్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం జరిగింది. ఇందులో భాగంగా చేసిన 70 సభ్యత్వాలలో 70క్రియాశీలక సభ్యత్వాలుచేయడం జరిగిందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు తెలిపారు. క్రియాశీలక సభ్యత్వం ద్వారా ప్రతి సభ్యునికి లక్ష రూపాయల ఇన్సూరెన్సు సదుపాయం లభిస్తుంది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పచ్చర్ల తిమ్మారెడ్డి మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పెండింగులోఉన్న ఉపాధ్యాయ బదిలీలు పదోన్నతులు జరగడంతోఉపాధ్యాయులు సంతోషంగా ఉన్నారని ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలపడం జరిగింది. షెడ్యూల్ ఇప్పించడంలో సంఘం పెద్దన్న పాత్ర పోషించింది. వారం రోజుల్లో మిగిలిపోయిన లెఫ్ట్ ఓవర్ వేకెన్సీస్‌కు పదోన్నతులు రాబోతున్నాయి అని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆయాపాఠశాల ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సంఘాలనాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కోరిక మేరకు బస్సులు నడిచేనా..

**ఆత్మకూర్ జులై 24 ప్రభాతవార్త:** మక్తల్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు పాఠశాల విద్యార్థులకు అనుగుణంగా బస్సులు కొనసాగించాలని బుధవారం రోజు అసెంబ్లీలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి రాష్ట్ర రవాణా శాఖ మంత్రివర్యులకు విజ్ఞప్తి చేయడంతో నియోజకవర్గంలోని ఉమ్మడి ఆత్మకూరు మండలంలో విద్యార్థులకు బస్సులు వేలకు బస్సులు కొనసాగిస్తారా అంటూ పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ఆత్మకూరు మండలంలోని రేచింతల, విరాఘవపురం, కొంపల్లి, ఆరుపల్లి, కట్టేపల్లి, కొంకన్వాన్‌పల్లి, ధర్మాపురం తదితర గ్రామాల నుండి విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు సమయానుకూలంగా బస్సులు కొనసాగించాలంటూ గత కొన్ని నెలలుగా విద్యార్థులతో పాటుగా విద్యార్థి సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు రోడెక్కి నిరసన చేపట్టిన విషయం ఎమ్మెల్యే దృష్టికి తేవడంతో బుధవారం అసెంబ్లీలో జరిగిన చర్చలో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు సమయానుకూలంగా బస్సులు కొనసాగించాలంటూ రాష్ట్ర మంత్రివర్యులకు విజ్ఞప్తి చేయడమే కాకుండా ముఖ్యమంత్రికి కూడా ప్రత్యేకంగా విజ్ఞప్తి చేయడంతో రాష్ట్రరవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించడం విశేషం అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే విద్యార్థిని విద్యార్థులకు బస్సులు వేలకు కొనసాగిస్తూ నియోజకవర్గంలో ప్రైవేట్ పాఠశాలలకు చెందిన స్కూల్ బస్సులను పెట్టిన సాధారణంగానే కొనసాగించే విధంగా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకునేందుకు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కోరడం అందుకు రాష్ట్ర మంత్రి కూడా తక్షణమే ఆదేశాలు జారీ చేరినట్లుగా వెల్లడించడంతో ఉమ్మడి ఆత్మకూరు మండలానికి పాఠశాల విద్యార్థులకు బస్సులు సమయానుకూలంగా కొనసాగుతాయంటూ విద్యార్థిని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## రైతుబీమా దరఖాస్తుల స్వీకరణ

**మక్తల్, జులై24 ప్రభాతవార్త:** 2024 సంవత్సరానికి గాను రైతుల నుంచి రైతుభీమా కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దరఖాస్తు చేసు కోవాలని జక్లేర్ క్లస్టర్ ఏఈఓ వైష్ణవి అన్నారు. మక్తల్ మండలం లోని బొందల్ కుంటలో బుధవారం దాదాపు 100 మంది రైతుల నుంచి నూతనంగా దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. నూతనంగా దరఖాస్తు చేసుకునే రైతులు ఆగస్టు 5లోపు, ఇది వరకు దరఖాస్తు చేసిన వారు మార్పులు, చేర్పుల కోసం ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**కొత్తకోట, జులై 24 ప్రభాతవార్త:** కొత్తకోట మండలం మీరాసిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ పికృష్ణయ్య మాతృమూర్తి బుధవారం తెల్లవారుజామున స్వర్గస్తులైయ్యారు. విషయము తెలుసుకున్న దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి భౌతికయానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వెంట కమిటీ అధ్యక్షులు పి నాగిరెడ్డి, మండల అధ్యక్షులు వామన్ గౌడ్, మాజీ జెడ్పిటిసి పి విశ్వేశ్వర్, మాజీ వైస్ ఎంపిపీ గుంత మల్లేష్, గాడిల ప్రశాంత్, మాజీ రైతు సమన్వయ అధ్యక్షులు జి కొండారెడ్డి, నాంచారం పేట మాజీ సర్పంచ్ గోపాల్‌నాయక్, నెహ్రూ, మహేష్, గ్రామ ఉపసర్పంచ్ జీవన్‌గౌడ్, మాజీ వార్డు మెంబర్లు గ్రామ సీనియర్ నాయకులు ఎం అయ్యాప్ప రెడ్డి, మంగలి రాములు, అంబటి జగదీష్ యాదవ్, దుర్గం రాములు, మాజీ ఎంపిటిసి రమణ, ప్రభాకర్, ఈశ్వర్ నాయుడు, మాజీ అధ్యక్షులు పాకనాటి మొగల్, బొయ్య చిన్న గోవిందు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్చక సమైక్య జిల్లా అధ్యక్షుడికి సన్మానం



**అయిజ జులై 24 ప్రభాతవార్త:** మండలానికి చెందిన చక్రవర్తి ఆచారి అర్చక సమైక్య జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకోవడంతో ఆయనను బుధవారం బిజెపి జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జప్రదీప్ శర్మ, వెంకటేశ్, సీనియర్ బిజెపి కార్యకర్తలు హిందూ సంఘ పరిరక్షకులు పాల్గొని మీసేవలకు అర్చక జిల్లా అధ్యక్షుడి గా ఎన్నుకోవడం చాలా సంతోషంగా ఉందని ఈ సందర్భంగా వారు చక్రవర్తి ఆచారి ని పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ డికేఅరుణతో మీకి ఎలాంటి సాయం కావాలన్నా మీకు మీ సంఘానికి పని ఏదైనా అవసరమైతే చేయిస్తానని వారు ఈ సందర్భంగా తెలియజేశారు.

## టిబి, క్షయ వ్యాధులను నివారించాలి



క్యాంపులో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**అడ్డాకుల, జులై 24 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బలీదుపల్లి గ్రామంలో బుధవారం క్షయవ్యాధి నివారణ అధికారి మహ్మద్ రఫీక్ ఆదేశానుసారం వైద్యాధికారులు డా. రహ్మత్ ఆధ్వర్యంలో టిబి, క్షయ వ్యాధి ఎక్స్‌రే క్యాంపు నిర్వహించారు. గ్రామంలో టిబి, క్షయ వ్యాధి మలేరియా, టైఫాయిడ్ లాంటి విషజ్వారాలు ఉన్నవారు క్యాంపులో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. 2017 నుండి 2023 సంవత్సరంలో టిబి మందులు తిని క్షయవ్యాధి కానీ లేదా నయమైన వారిని టిబి, క్షయ వ్యాధి లక్షణాలున్న వారిని తప్పనిసరిగా ఆశ వర్కర్లు తీసుకుని రావాలి. డయాబెటిక్ బిబిహెచ్‌ఐవి ఉన్న వ్యక్తులు, పొగ తాగేవారు ఆల్కహాల్ తీసుకునేవారు మూత్రపిండాల వ్యాధిగ్రస్తులు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఉన్న వాళ్లని తప్పనిసరిగా ఆశ వర్కర్లు తీసుకు వచ్చి పరీక్షలు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధి కారులు డా. నరేష్‌చంద్ర, డా. వీరస్వామి, సిహెచ్ భాస్కర్, ఎచ్‌టిసిఎస్ ఎం బాల రాజ్, ఎస్‌టిఎస్ రాజు, ఏఎన్ఎం చంద్రకళ, ఆశా వర్కర్లు మంజుల, కృష్ణవేణి, జ్యోతి, భాగ్యమ్మ, రాధ గ్రామస్తులు పాల్గొన్నారు.

## మెజార్టీ ప్రజల ఆమోదయోగ్యమైన కేంద్ర బడ్జెట్



**మక్తల్ టౌన్, జులై 24 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మెజార్టీ ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉందని బిజెపి సోషల్ మీడియా కన్వీనర్ రాజాగౌడ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసి కోటిమంది రైతుల ప్రకృతి సేద్యం చేసే విధంగా చర్యలు పేదవారి గృహ నిర్మాణం రక్షణ రంగం కోసం ఇలా అన్ని పేద, మధ్య తరగతుల కోసం కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయించిందని రాజాగౌడ్ హర్షం వ్యక్తం చేశారు.

## ప్రధాని మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం



**వనపర్తి టౌన్ జులై 24 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా బిజెపి కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు బచ్చు రామ్ ఆధ్వర్యంలో వికసిత భారత్ లక్ష్యాలుగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రూ.48.20 లక్షల కోట్ల బడ్జెట్ స్వాగతిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాలాభిషేకం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు మేకల శిల్పా రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డి నారాయణ, రాష్ట్ర కార్య వర్గ సభ్యులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్ గౌడ్, అధ్యక్షులు సీతారాములు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అశ్విని రాధా, వనపర్తి పట్టణ మహిళా బిజెపి అధ్యక్షురాలు కవిత యాదవ్, సుగూరు లక్ష్మి ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు కొమ్ము శామ్యూల్, పట్టణ ప్రధాన కార్యదర్శులు సుగురు రాము, రాయన్న, సాగర్, జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ విజయ్ కుమార్, ఏం రాము శివ బొడ్డుపల్లి వెంకటేష్ రఘు కొండన్న రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు కుమారస్వామి మేకల శిల్పా రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో అతిపెద్ద దేశంగా 2030 వ సంవత్సరం దేశంలోనే యూవత్ ప్రపంచంలోనే నెంబర్ వన్ దిశగా తీసుకెళ్లాలనివరకు పేదలు, రైతులు, యువత, మహిళల అభ్యున్నతి వికసితభారత్ లక్ష్యాలుగాతీర్చిదిద్దడానికికావాల్సిన ఉపాధి, ఉద్యోగ, మౌలిక వసతులు, నైపుణ్యం, పారిశ్రామికీకరణ లాంటి ప్రధాన అంశాలకు బడ్జెట్ లో అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ ఏర్పడ్డకా ఆరు గ్యారెంటీలని ఇచ్చి ఇంతవరకు అమలు చేయడం సిగ్గుచేటు అని తెలియజేశారు. భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రధానమైన మూలధన వ్యవయం కోసం ఈ ఏడాది రూ.11.11 లక్షల కోట్లు కేటాయించారు. దేశ ఆర్థిక పురోగతి ఇక పైనా కాంతులీనుతూనే ఉంటుందని నిర్మల చెప్పారు. రాష్ట్రాలూ తమ పరిధిలో మౌలిక వసతులను అభివృద్ధి చేసుకోవడానికి రూ.1.5 లక్షల కోట్ల లక్షల కోట్ల వడ్డీరహిత ఋణాలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. 2025-26 సంవత్సరంలో విత్తలోటు స్థూలజాతీయోత్పత్తిలో 4.9శాతం ఉంటుందన్నారు. పర్యావరణానికి పెద్దపీట వేస్తూ అధునాతన అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్లు నిర్మించాలని నిర్ణయించారు. పరిశ్రమల నుంచి వెలువడే కర్బన ఉద్గారాలను తగ్గించేందుకూ లక్ష్యాలే నిర్దేశించారు. బడ్జెట్ అన్ని వర్గాలకు మేలు చేసేలా ఉందని స్పష్టం చేశారు.

## పచ్చటి మొక్కలతోనే భావితరాల భవిష్యత్



**ఇటిక్యాల జులై24 ప్రభాతవార్త:** పచ్చటి మొక్కలతోనే బావితరాలకు మంచి ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించగలమని అందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని డిఎస్పి సత్యనారాయణ అన్నారు. బుధవారం డిఎస్పి ఇన్స్పెక్షన్‌లో భాగంగా జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు ఆదేశాల మేరకు మండల పరిధిలోని కోదండపూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పలు రికార్డులను పరిశీలించిన అనంతరం వన మహోత్స వంలో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ పచ్చటి మొక్కలు నాటడమంటే భవిష్యత్తు తరాలకు మంచి భవిష్యత్తు ఇవ్వడమే అని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే బాధ్యతను స్వీకరించాలని, నాటడంతో పాటు, వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో అలంపూర్ సీఐ రవిబాబు, ఎస్సై స్వాతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం

**పెద్దమందడి జులై24 ప్రభాతవార్త:** పెద్దమందడి మండలం జగత్‌పల్లి గ్రామానికి చెందిన చవ్వ పెద్ద వెంకటయ్య మృతి చెందాడు. ఈ విషయాన్ని చెవ్వగట్టు యాదవ్ పెద్దమందడి మండల సమన్వ యకర్త తూడి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసు కెళ్లగా, ఆయన వెంటనే స్పందించి, అంత్యక్రియలు ఖర్చుల నిమిత్తం రూ.5వేలు ఆర్థిక సాయాన్ని చెవ్వగట్టు యాదవ్ ద్వారా, జగత్‌పల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నేతలద్వారా మృతు ని కుటుంబసభ్యులకు అందజేశారు. ఆర్థిక సాయం అందజే సిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గట్టుయాదవ్, చవ్వ మున్నూరు రాములు, పర్వతాలు యాదవ్, చంద్రసాగర్, శేషు, రమేష్, పురుషోత్తం, కోనూరు బాలయ్యఉన్నారు. మృతుని కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

**మక్తల్, జులై 24 ప్రభాతవార్త :** మండలంలోని చిట్యాల, పస్పుల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన విద్యా స్వేచ్ఛ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మొత్తం 200ల మంది విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను అందించారు. ప్రధానోపాధ్యాయు రాలు సవిత, ఉపాధ్యాయులు విదుర్‌కుమార్, రవిందర్‌రెడ్డి, వరలక్ష్మి, జ్యోతి, విద్యా స్వేచ్ఛఫౌండేషన్ ప్రతినిధులు వాసుదేవరావు, లక్ష్మణ్, నితిన్, విజయ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ఆర్థికసాయం అందజేసిన బికెఆర్ ఫౌండేషన్ అధినేత

**మక్తల్ టౌన్, జులై 24 ప్రభాతవార్త :** పట్టణంలో బసవేశ్వర్ కాలనీలో రాజుల రాజారెడ్డి గతకొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో తనవంతు సహాయం రూ.25 వేలు బికెఆర్ ఫౌండేషన్ అధినేత గవినోళ్ల బాలకృష్ణారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీజడ్పీటిసి లక్ష్మారెడ్డి, రాజురెడ్డి, శివరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన మార్కెట్‌యార్డు డైరెక్టర్‌గా నియమితులైన బొక్కలపల్లి శేఖర్‌రెడ్డి

**అడ్డాకుల, జులై24 ప్రభాతవార్త:** నమ్మిన పార్టీ కోసం దశాబ్దాల కాలంగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేసిన కాంగ్రెస్ నాయకులు అడ్డాకుల మండల కేంద్రానికి చెందిన బొక్కలపల్లి శేఖర్‌రెడ్డి పార్టీ అధిష్టానం గుర్తించి మదనపురం మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా నియామకం చేసిన ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియపరుస్తూ నూతన డైరెక్టర్‌గా ఎంపికైన శేఖర్‌రెడ్డికి శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షులు నాగిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు తోటశ్రీహరి, గంగుల విజయ్, మోహన్‌రెడ్డి, వేగనాథ్, నాయకులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ

**వెల్దండ, జులై 24 ప్రభాతవార్త:** మండలంలోని చొక్కన్నపల్లి గ్రామానికి చెందిన టీఆర్ఎస్ పార్టీ నాయకులు కుడుముల శ్రీనివాస్‌రెడ్డి తండ్రి కుడుముల వెంకట్ రెడ్డి మృతి చెందారు. మృతుడి కుటుంబాన్ని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించి మృతదేహనికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ నాగులునాయక్, విజయేందర్‌రెడ్డి, జంగయ్య, మధుసూదన్‌రెడ్డి, తిర్మల్‌రావు, నిరంజన్, అశోక్, ప్రవీణ్, నాగేష్, వెంకట్‌రెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.

## వితంతు మహిళపై అఘాయిత్యానికి యత్నం

**బిజినేపల్లి, జులై 24 ప్రభాతవార్త:** వితంతు మహిళపై అఘాయిత్యానికి యత్నించిన వ్యక్తిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. వెలుగొండ గ్రామానికి చెందిన వితంతు మహిళ తొమ్మి దేళ్ల క్రితం తన భర్త చనిపోవడంతో భర్త తరపున తనకు దాయాదుల నుండి రావాల్సిన భూ సమస్య నెలకొంది. నెలకొన్న భూ సమస్యపై గ్రామానికి చెందిన మధుసూదన్‌ను ఆశ్రయించింది. దాయాదుల మధ్య రాజీ కుదిర్చి బాధితురాలికి రావలసిన భూమినిరిజిస్ట్రీ చేయించాడు. ఇదే అదుపుగా బాధితురాలి పట్ల అస భ్యంగా ప్రవర్తించి అఘాయిత్యానికి యత్నించినట్లుఎస్సై తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు.

## మున్ననూర్‌లో విషాదఛాయలు

**గోపాల్‌పేట జులై24 ప్రభాతవార్త:** గోపాల్‌పేట మండలం మున్ననూర్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి, ఈ నెల 18వ తేదీన మున్ననూరు గ్రామంలో ఒక ఇంటిలో గ్యాస్ సిలిండర్ పేలి భార్య భర్తలకు తీవ్ర గాయలయ్యాయి, క్షతగ్రాతులను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించగా చికత్స పొందుతూ బుధవారం రోజు మృతి చెందారని గ్రామస్తులు తెలిపారు.

# దేశానికే గర్వకారణం.. సూదిని జైపాల్‌రెడ్డి

● రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణరావు ● సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహ ఆవిష్కరణ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి, ఎమ్మెల్యేలు



విగ్రహ ఆవిష్కరణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి

**వెల్దండ, జులై 24 ప్రభాతవార్త:** తెలంగాణ ముద్దుబిడ్డ సూదిని జైపాల్‌రెడ్డి దేశానికే గర్వకారణమని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణరావు అన్నారు. మండల పరిధిలోని కొట్ర చౌరస్తా వద్ద దివంగత మాజీ కేంద్రమంత్రి వర్యులు సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహ ఆవిష్కరణ ఏర్పాట్లను బుధవారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణరావు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహన్నిమన ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవడం ఎంతో అభినం దనీయమని, వారి హయంలోనే ఢిల్లీ అభివృద్ధితో పాటు తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారన్నారు. ఈ నెల 28న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా దివంగత కేంద్రమంత్రి సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహన్ని ఆవిష్కరిస్తున్నట్లు ఆయన తెలిపారు. మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చురామకృష్ణ, కాయితీసాయిరెడ్డి, నాయకులు సంజీవ్‌కుమార్‌యాదవ్, మట్టవెంకటయ్యగౌడ్, జక్కులచిన్న జంగయ్య యాదవ్, గోళి సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# 28న సీఎం రేవంత్‌రెడ్డి రాక

● దివంగత కేంద్రమాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ
● సీఎం హోదాలో కల్వకుర్తికి సీఎం రేవంత్‌రెడ్డి రాక



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కల్వకుర్తి, జులై 24 ప్రభాతవార్త:** కల్వకుర్తి నియోజకవర్గానికి మొట్ట మొదటి సారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హోదాలో ఈ నెల 28న కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రానికి విచ్చేస్తున్నారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అదనపు కలెక్టర్‌లతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ పట్టణ సమీపంలోని కొట్ర చౌరస్తాలో ఈ నెల 28న కేంద్రమాజీ మంత్రి ఉత్తమ పార్లమెంటరీయన్ దివంగత సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందని, అదే విధంగా మున్సిపల్ కార్యాలయం ప్రక్కను న్న టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ కార్యాలయ ప్రాంగణ ఆవరణలో 15వేల మందితో బహిరంగ సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ముందుగా క్రీడా మైదాన ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి హెలిక్యాప్టర్ లో వస్తున్న సందర్భంగా ల్యాండింగ్ స్థలాన్ని పరిశీలించి, కొట్ర చౌరస్తాలో విగ్రహావిష్కరణ ఏర్పాట్ల పనులను పరిశీలించినట్లు తెలిపారు. మొదటి సారిగా సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా ఘనంగా స్వాగతం పలికి బహిరంగ సభను విజయవంతంచేయాలని, విగ్రహావిష్కరణ కార్యక్రమం ప్రభుత్వ కార్యక్రమం కాబట్టి జిల్లా స్థానిక అధికారులు దగ్గరుండి పనులను, ఏర్పాట్లను పర్యవేక్షించి పనులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో సూదిని జైపాల్‌రెడ్డి అబిమానులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అనుబంధసంఘాల నాయకులు, నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జిల్లాఅధికారులు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ ఇబ్రహీం, పలు శాఖల అధికారులు, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

# మెడిసిన్ గార్డెన్‌లు తయారు చేయడం లక్ష్యం

● మహబూబ్‌నగర్ జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు



పాఠశాలల్లో ఔషధ మొక్కలను నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 24 ప్రభాతవార్త:** స్కూల్ ఎర్త్ క్లబ్ యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రామ్‌లో (ఎల్ప్) భాగంగా కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ (సిజిఆర్) పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ పాఠశాలల్లో ఔషధ మొక్కలను నాటినట్లు జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూమహబూబ్‌నగర్ జిల్లాలో బుధవారం రాజాపూర్, కూచూర్, వెన్నచేడ్, హన్వాడ, ఎదిర, షాషాబ్‌గుట్ట, సిసికుంట, వేముల, ఆలూరు వంటి 10 పాఠశాలలకు ఔషధ మొక్కలను ఇచ్చి జిల్లా విద్యాశాఖ అధికారి రవిందర్ చౌరవతో పాఠశాలల ప్రాంగణంలో మెడిసినల్ గార్డెన్‌ను తయారు చేశారు. ప్రతి పాఠశాలకు 12 రకాలకు సంబంధించిన మొత్తం 40 ఔషధ మొక్కలను అనగా సరస్వతి ఆకు, ఇన్సులిన్, కలబంద, ఉసిరి, నిమ్మ, గోరింటాకు, దగ్గు ఆకు, రణపాల, తమలపాకు వంటి ఔషధ గుణ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరిపూర్ణమైన ఆరోగ్యానికి, జ్ఞాపకశక్తి సామర్థ్యం మెరుగుదలకు ఉపయోగపడే ఔషధ మొక్కల ప్రాధాన్యత గురించి ప్రోగ్రాం ఆఫీసర్ విశ్వేశ్వర రావు విద్యార్థులకు వివరించారు. జిల్లా సైన్స్ అధికారి బి. శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులకు మొక్కల రక్షణ, మొక్కలు పెంచే విధానం, ఔషధ గుణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, సిజిఆర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కొత్తపల్లి రవి, ఉపాధ్యాయులు బృందం పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి



బిక్షాటన చేస్తున్న కార్మికులు

**తెల్కపల్లి, జులై24 ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా కమిటి సభ్యులు గోపాస్ లక్ష్మణ్ అన్నారు. బుధవారం రాష్ట్ర కమిటి పిలుపు మేరకు తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎండి సైదులు, ఎం. లింగస్వామిల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బిక్షాటన నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటి సభ్యులు గోపాస్ లక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 56 వేల మంది గ్రామ పంచాయతీ కార్మికులు ప్రజా శ్రేయస్సు కోసమై ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా ఆరోగ్యాలను కాపాడుతున్నటువంటి గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వకోవడం సిగ్గుచేటన్నారు. వేతనాలు ఇవ్వకపోతే 11 నెలలుగా వారి కుటుంబాలు ఎలా బ్రతకాలని ఆయన ప్రశ్నించారు. సఫాయి కార్మికులు చేస్తున్న సేవలు వెలకట్టలేమని ఆయన అన్నారు. సంవత్సర కాలంగా వేతనాలు అందక నిత్యావసరసరుకుల కోసం చేసిన అప్పులు తీర్చలేక రాష్ట్రంలో ఇటీవల కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని అవన్ని కూడా ప్రభుత్వ హత్యలేనని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వెంటనే పెండింగ్ వేతనాల బడ్జెట్ రిలీజ్ చేశామని చెప్తున్న ప్రభుత్వం ఎందుకు కార్మికుల ఖాతాల్లో వేయలేదని ప్రశ్నించారు. కార్మిక పెండింగ్ డబ్బులు చెల్లించకపోతే ఈనెల 30న అసెంబ్లీ ముట్టడి చేపడతామని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో జేపీ కార్మికులు మైసమ్మ, యాదమ్మ, లక్ష్మయ్య, బాలయ్య, రాజు, నాగయ్య, రాములు, బాలరాజు, ఎల్లయ్య, మల్లయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

# 5 రోజులు..47టీఎంసీలు



- శ్రీశైలం జలాశయానికి పెరుగుతున్న నీటిమట్టం
- 833 అడుగులకు చేరిన శ్రీశైలం డ్యాం
- జూరాల నుంచి 41గేట్ల ద్వారా నీటి విడుదల
- నారాయణపూర్ ప్రాజెక్టు లోతట్టు ప్రాంతాలు అప్రమత్తం
- ఈ ఏడాది అత్యధికంగా 2.25లక్షల క్యూసెక్కులు దిగువకు..

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 24, ప్రభాతవార్త:** గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులకు జలకళ సంతరించుకున్నది. కర్ణాటక ఎగువ ప్రాంతంలో ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాం పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తున్నది. గత ఐదు రోజులుగా ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద వస్తుండడంతో ప్రాజెక్టులకు భారీగా నీరు చేరుతున్నది. ఈక్రమంలో శ్రీశైలం జలాశయంలో ఐదు రోజులకు 47టీఎంసీల వరద చేరింది. దీంతో డెడ్ స్టోరేజీలో ఉన్న జలాశయానికి కృష్ణమ్మ పరవళ్ల తొక్కుతున్నది. గురువారం నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి అత్యధికం స్థాయిలో 2.30 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతుండడంతో లోతట్టు ప్రాంతాలను యంత్రాంగం అప్రమత్తం చేసింది.

**ప్రియదర్శిని జూరాలకు..**

ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులకు వరద పోటెత్తింది. బుధవారం 1,65,000 క్యూసెక్కుల వరద డ్యాంకు చేరగా 41గేట్లు ఎత్తిస్పిల్ వే ద్వారా 1,50,593 క్యూసెక్కులు, పవర్ హౌజ్ ద్వారా 24వేల688క్యూసెక్కులు దిగువకు వదిలారు. జూరాలలో పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 6.218టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఎగువ, దిగువ జూరాల జల విద్యుత్ కేంద్రాల్లోని 276 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగింది. జూరాల నుంచి భీమా లిఫ్ట్ -1కు 1300 క్యూసెక్కులు, నెట్టెంపాడు 1500క్యూసెక్కులు విడుదల చేశారు. మొత్తం జూరాల నుంచి 179527 క్యూసెక్కులు దిగువకు వదిలారు. ప్రియదర్శిని జూరాల డ్యాంకు వరద రావడంతో జలకళను సంతరించుకున్నది. కర్ణాటక, ఆంధ్రా నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు తరలివస్తున్నారు.

**నారాయణపూర్ ప్రాజెక్టు ప్రాంతంలో హెచ్చరికలు..**

కర్ణాటకలోని ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చుతున్నది. కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు భారీగా వరద వచ్చి చేరుతున్నది. ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరద పోటెత్తింది. కర్ణాటకలోని ఆల్మట్టి ప్రాజెక్టుకు 1,78,528 క్యూసెక్కుల వరద చేరడంతో ఆల్మట్టి ప్రాజెక్టు గేట్ల ద్వారా 1,97000క్యూసెక్కులు దిగువకు నీటిని వదులుతున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 2.25,000క్యూసెక్కుల భారీ వరద వస్తుండడంతో 2,30,000క్యూసెక్కులు దిగువకు వదులుతున్నట్లు అధికారులు వెల్లడించారు. గురువారం సాయంత్రం 7గంటల నుంచి రాత్రి 11గంటల వరకు నిరంతరంగా 230,000క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదలుతున్నట్లు తెలిపారు. దీంతో నారాయణపూర్ ప్రాజెక్టు పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికార యంత్రాంగం అప్రమత్తం చేసింది. భారీగా వరద జలాలు దిగువకు వదులుతున్న నేపథ్యంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

**849అడుగులకు శ్రీశైలం డ్యాం..**

జూరాల నుంచి 41గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేయడంతో శ్రీశైలం డ్యాంకు భారీగా ఇన్‌ఫ్లో నమోదైంది. శ్రీశైలం జలాశయానికి సాయంత్రం 6గంటల సమాచారం మేరకు లక్షా75వేల 448 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 885అడుగులు, 215.807 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 849.80 అడుగులు, 79.6340 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. గత ఐదు రోజుల కిందట ఈనెల 19న ప్రాజెక్టు నీటిమట్టం 807అడుగులు, 33టీఎంసీలుగా నమోదు కాగా ప్రస్తుతం 79.6టీఎంసీలకు చేరింది. ఐదు రోజుల్లో 47టీఎంసీలు డ్యాంకు చేరాయి. ఇదే స్థాయిలో ఇన్‌ఫ్లో ఉంటే మరో వారం రోజుల్లో నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకుంటుందనిఅధికారులు చెబుతున్నారు.

## బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి

● మహబూబ్‌నగర్ యూత్ కాంగ్రెస్ జిల్లా సెక్రెటరీ బండ గిరిప్రసాద్



**జడ్చర్ల, జులై 24 ప్రభాతవార్త:** తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, ఆరుగురు ఎంపీలు ఉన్న తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో మరోసారి నిరాశ ఎదురైందని మహబూబ్‌నగర్ యూత్ కాంగ్రెస్ జిల్లా సెక్రెటరీ బండ గిరిప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16 స్థానాలు ఉన్న ఏపీ, బీహర్ రాష్ట్రాలకు ఎక్కువ నిధులు కేటాయించారని, తెలంగాణ రాష్ట్రానికి మాత్రం ఎలాంటి నిధులు కేటాయించకుండా తెలంగాణ రాష్ట్రం పట్ల బీజేపీకి ఉన్న చిత్తశుద్ధిని ప్రదర్శించారన్నారు. ప్రధాని మోడీకి అదాని, అంబానీల మీద ఉన్న ప్రేమ తెలంగాణపై లేదనడానికి ఇదే నిదర్శనమన్నారు. మూడుసార్లు అధికారం చేపట్టిన మోడీసర్కార్ తెలంగాణకు ఈ బడ్జెట్‌లో తీరని అన్యాయం చేశారని బదులిచ్చారు.

## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే చిట్టెం



**మక్తల్ టౌన్, జులై 24 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో కెటిఆర్‌ను మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అంద జేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెంరామ్మోహన్‌రెడ్డి, కొడంగల్‌మాజీ ఎమ్మెల్యే పట్నం నరెందర్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి సలీం పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన జ్ఞానేశ్వర్

**రాజాపూర్, జులై 24 ప్రభాతవార్త:** రాజాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా జ్ఞానేశ్వర్ బాధ్యతలు చేపట్టారు. గతంలో రాజాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన గోపాల్‌నాయక్ నవాబ్‌పేట మండలం లింగంపల్లి గ్రామ పంచాయతీకి బదిలీపై వెళ్లడంతో దాదాపు 10 సంవత్సరాలు హన్వాడ మండలం సల్లోనిపల్లి గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఆయన బదిలీపై బుధవారం రాజాపూర్ గ్రామ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి పరచడంలో తనవంతు కృషి చేస్తానని వివిధపార్టీల నాయకులు, గ్రామ పెద్దలుఅభివృద్ధిలో వారి సహకారం అందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## ఉద్యోగులకు బదిలీలు సహజమే..

**తెల్కపల్లి, జులై 24 ప్రభాతవార్త:** ఉద్యోగులకు బదిలీలు, ప్రమోషన్లు సహజమే అని మండల నోడల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్న ముద్దునూర ప్రాథమికోన్నత పాఠశాల నుండి ఇటీవల బదిలీలు, ప్రమోషన్లపై వెళ్తున్న ఉపాధ్యాయులకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని వారు మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయులు ఎక్కడ ఉన్నా అంకితభావంతో పని చేస్తూ విద్యార్థులకు విద్యాబుద్దులు నేర్పాలన్నారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుండి మాకు విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడం మాకు ఎంతో బాధగా ఉందని తెలిపారు. అనంతరం పదోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయుడు సాజిద్ విద్యార్థులకు అవసరమైననోట్‌బుక్కులు, పలకలు, పెన్నులు, ఎగ్జామ్ ప్యాడ్లను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్‌రావు, పదోన్నతులపై వెళ్లిన ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, సాజిద్, మల్లయ్య, బదిలీపై వెళ్లిన రాజశ్రీ, సాయిప్రకాష్, పాఠశాల ఉపాధ్యాయులు శకుంతల, శ్రీలత, ఉమాబాయి, రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళను కాపాడిన పోలీసులు..

### పోలీసులను అభినందించిన జిల్లా ఎస్పీ

**ఇటిక్యాల జులై 24 ప్రభాతవార్త:** కుటుంబ కలహాలతో బీచుపల్లి కృష్ణానదిలోకి దూకేందుకు యత్నించిన మహిళను ఇటిక్యాల పోలీసు సిబ్బంది శ్రీనివాస్, వరదరాజు అక్కడే ఉన్న గజ ఈతగాళ్లు కాపాడారు. కుటుంబ కలహాలతో వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ బుధవారం ఉదయం 9 గంటల సమయంలో బీచుపల్లి పుష్కర ఘాట్ దగ్గరకు వచ్చి పుష్కర ఘాట్ దగ్గర అటు ఇటు తిరిగి నదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడేందుకు యత్నించిన సమయంలో ఇటిక్యాల పోలీసులు శ్రీనివాస్, వరదరాజులు కాపాడారు. అనంతరం ఆమెను విచారించి ఎస్సై వెంకటేశ్ కు సమాచారం అందించారు. అలాగే ఆమె కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే బీచుపల్లికి చేరుకోవాలని సూచించగా ఆమె కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. అనంతరం వారిని ఎర్రవల్లి చౌరస్తాలో గల పోలీసు అవుట్ పోస్టులో వారికి కౌన్సిలింగ్ నిర్వహించి ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించి అక్కడి నుంచి సొంత గ్రామానికి పంపించారు. ఈ సందర్భంగా బీచుపల్లి పుష్కర ఘాటు వద్ద అక్కడే విధులలో ఉన్న ఇటిక్యాల బ్లూకోర్ట్సు సిబ్బంది శ్రీనివాస్, వరదరాజులు తక్షణమే బ్లూ కోల్ట్స్ సిబ్బంది స్పందించి మహిళ ప్రాణాలను కాపాడటం పట్ల జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు వారిని అభినందించారు.

## ఎపిజివిబి బ్యాంకు మేనేజరుతో ఋణ మాఫీ వివరాలు తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే

**గోపాల్‌పేట జులై24 ప్రభాతవార్త:** గోపాల్‌పేట మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజరుతో రైతు ఋణమాఫీ వివరాలు అడిగి తెలుకున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఎపిజివిబి బ్యాంకు లో 1666 రైతుల అకౌంట్స్ లో 1 లక్ష లోపు ఉన్న 9.4 కోట్ల రూపాయలు ఋణమాఫీ కావడం జరిగిందని ఇంకా కొన్ని ఖాతాలు ప్రాసెస్ లో ఉన్నాయని తెలియచేసారు. ఈ సందర్భంగా మేఘారెడ్డి మాట్లాడుతూ ఋణం ఉన్నా ప్రతి రైతుకు తప్పకుండా ఋణ మాఫీ అవుతుందని, లక్ష లోపు ఉన్న అర్హులైన రైతులకు మాఫీ అయ్యాయని ఆగష్టు 15 వరకు 2 లక్షల ఋణాలు కూడా మాఫీ అవుతాయని తెలియజేశారు. ఈ ఉమ్మడిమండలాల కార్యక్రమంలో ఉమ్మడి మండలాల ఇంచార్జి సత్యశీలరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శివన్న, వెంకటయ్య, బాలయ్య, నాగరాజు, మండల కాంగ్రెస్ కార్యర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాల కార్మిక చట్టం కింద కేసు నమోదు

**గోపాల్‌పేట జులై 24 ప్రభాతవార్త:** బాల కార్మికునికి విముక్తి కల్పించి సదరు యజమానిపై కేసు నమోదు చేసినట్లు గోపాల్ పేట పోలీసులు వెల్లడించారు. వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని ఏదుల గ్రామంలో ముస్కాన్ బృందం గస్తీ చేయుచుండగా మెయిన్ రోడ్ పై ఉన్న శ్రీ ఆంజనేయ బైక్‌పాయింట్‌లో ఒక బాల కార్మికుడిని పనిలో పెట్టుకుని పనిచేస్తుండగా గుర్తించి బైక్ మెకానిక్ ఓనర్‌జానీపై బాల కార్మిక చట్టం ప్రకారం అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని వనపర్తి జిల్లాఅసిస్టేంట్ లేబర్ ఆఫీసర్ నిశాంత్ కుమార్‌పోలీసులకు ఫిర్యాదు చేశారు. పై స్పందించిన ఎస్సై బైక్ మెకానిక్‌షాప్ యజమాని జానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.

## స్పోర్ట్స్ అభివృద్ధిలో జిల్లాకే మొదటి ప్రాధాన్యత



మాట్లాడుతున్న కొత్త కాపు శివ సేనరెడ్డి

**మొదటి పేజీ తరువాయి భాగం..**

అన్నారు. నియోజక వర్గంలో స్పోర్ట్స్ అభివృద్ధికి రూ.30 నుంచి రూ.40 కోట్ల రూపాయలు విడుదల చేసేలా కృషి చేయాలని శివాసేనారెడ్డిని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని, ఇటీవలే రెండు లక్షల రైతు ఋణమాఫీ చేయడం కాంగ్రెస్ పార్టీకే చెల్లిందన్నారు. పదేళ్లు పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తలు గుర్తిస్తామని, పార్టీ కోసం పనిచేసిన వ్యక్తులకు పదవులు నడుచుకుంటూ వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, పీసీసీ డెలిగేట్ శంకర్ ప్రసాద్, శంకర్ నాయక్, ధనలక్ష్మి, విష్ణువర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్ బ్రహ్మం, వెంకటస్వామి, సతీష్, సత్యశీలా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.